చెత్తను రిక్షా కార్మికులకు అందించాలి

బండ్లగూడ: ప్రజలు తమ ఇళ్లల్లోని చెత్తను ఇళ్ల వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు అందించాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం కార్పొరేషన్ పరిధిలోని 22వ డివిజన్ ఆదర్శనగర్ కాలనీలో తడి, పొడి, హానికర చెత్తపై కాలనీ ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. వినాయకనగర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించారు. సన్‌సిటీ మెయిన్ రోడ్డులోని టాయిలెట్స్ క్లీనింగ్ పనులను చేయించారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఆయన పలు సూచనలిచ్చి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ ఎస్.రవి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మహాకాళి ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తదితరులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బుజిలి మహాకాళి అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ కార్పొరేషన్ బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో మాజీ మేయర్ లతాప్రేమ్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఏ–బ్లాక్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, నేతలు తోట మల్లేష్, సత్యనారాయణ, ప్రకాష్‌గౌడ్, నాగేష్, తిరుమల్లేష్, రాములు, కుమార్, రాజుగౌడ్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా చెట్టు కొమ్మలు



రాజేంద్రనగర్: బుద్వేల్ ప్రధాన రహదారిపై పడివున్న చెట్టుకొమ్మలు ప్రమాదకరంగా మారాయి. వారం క్రితం జోరుగా వీచిన గాలివానకు ప్రధాన రహదారిపై ఉన్న ఓ చెట్టు కొమ్మ విరిగి రోడ్డుపై పడింది. అప్పటి నుంచి ఆ చెట్టుకొమ్మ రోడ్డుపై అలాగే ఉంది. దీంతో పాదచారులు, వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నది. ప్రస్తుతం ఇది ప్రధాన రహదారిపై సగం రోడ్డును ఆక్రమించి ప్రమాదకరంగా కూడా తయారైంది. ఎలాంటి ప్రమాదం జరగక ముందే చెట్టు కొమ్మను జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

హెచ్‌సీయూలో 'ఫ్లాష్ ప్రొటెస్ట్'

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 'ఫ్లాష్ ప్రొటెస్ట్' పేరిట బుధవారం విద్యార్థులు నిరసన తెలిపారు. హెచ్‌సీయూ స్టూడెంట్స్ యూనియన్ 2024–25 ఆధ్వర్యంలో హెచ్‌సీయూలోని పరిపాలనా భవనం ముందు 4 ప్రధాన డిమాండ్ల పరిష్కారాన్ని కోరుతూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు నినాదాలు చేశారు. విద్యార్థి నాయకులు మాట్లాడుతూ ఎస్టేట్ సెక్షన్ ఇన్‌చార్జిని తొలగించాలని, క్యాంపస్‌లో క్యాంటీన్లలో ధరలు అందుబాటులో ఉండేలా చూడాలని, అలాగే శుభ్రమైన వాతావరణంలో నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే బోనాలకు గుర్తింపు

గోల్కొండ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలోనే తెలంగాణ బోనాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఈనెల 26న గోల్కొండ రిసాల బజార్ నుంచి నిర్వహించే బోనాల జులూస్‌కు హాజరుకావాలని కోరుతూ వృత్తి పని సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి బుధవారం ఆమెకు ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ఖరారు చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే అని అన్నారు. కార్యక్రమంలో బి.శ్రీకాంత్ చారి, మహంకాళి ఆలయ పూజారి బి.సురేశ్‌చారి, బండారి మహేందర్ ముదిరాజ్, కొట్టాల యాదగిరి ముదిరాజ్, బండారి నాగేందర్, ప్రశాంత్ కుమార్, కడారి రఘు తదితరులు ఉన్నారు.

రైల్వే అండర్‌పాస్‌ల నిర్మాణాలు.. తీరనున్న కష్టాలు!



- రెండు చోట్ల కొనసాగుతున్న నిర్మాణ పనులు
- అండర్‌పాస్ వంతెన వద్ద వరదనీటి సమస్యలకూ పరిష్కారం

జూకల్–పెద్దషాపూర్ మార్గంలో చేపట్టిన రైల్వే అండర్‌పాస్

శంషాబాద్ రూరల్: రైల్వే క్రాసింగ్‌ల వద్ద అండర్‌పాస్ వంతెనల నిర్మాణాలతో స్థానికులు, వాహనదారుల కష్టాలు తీరనున్నాయి. ప్రమాదాల నివారణతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు రైల్వేశాఖ వీటి నిర్మాణానికి చర్యలు చేపట్టింది.

- శంషాబాద్ పట్టణంలోని ఉందానగర్–తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ల మధ్యలో 7 ప్రాంతాల్లో రైల్వే క్రాసింగ్‌లు ఉన్నాయి. బెంగుళూరు జాతీయ రహదారిపై తొండుపల్లి వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఉంది. ఇది వరకే నాలుగు చోట్ల అండర్‌పాస్‌ల నిర్మాణం పూర్తి కాగా.. మరో రెండు చోట్ల పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

జూకల్ స్టేషన్ వద్ద...

పాల్మాకుల–పిల్లోనిగూడ దారిలో ఉన్న రైల్వే క్రాసింగ్ వద్ద అండర్ పాసు పనులు చేపట్టారు. సమీపంలోనే కొత్తగా జూకల్ రైల్వే స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ గూడ్సు రైళ్ల నిలిపి సరుకుల రవాణా చేస్తున్నారు.

- ఈ మార్గంలో ప్రస్తుతం అండర్‌పాసు పనులు జరుగుతున్నాయి. ఇక్కడ 15 ఏళ్ల కిందటి వరకు క్రాసింగ్ గేటు కూడా లేదు. తరచూ ప్రమాదాలు చోటు చేసుకోవడం.. స్థానికుల ఆందోళన నేపథ్యంలో గేటు ఏర్పాటు చేశారు. ఏడాది కిందట అండర్‌పాసు పనులు సైతం చేపట్టారు. వంతెన పూర్తయితే సమీప గ్రామాల వారికి ఇబ్బందులు తీరనున్నాయి.
- బెంగుళూరు జాతీయ రహదారిలోని పాల్మాకుల నుంచి శంషాబాద్–షాబాద్ రహదారిని అనుసంధానం చేసే ఈ మార్గాన్ని విస్తరించారు. ఇప్పుడు రైల్వే అండర్‌పాస్ వంతెన పనులు కొనసాగుతున్నాయి.

జూకల్–పెద్దషాపూర్ మార్గంలో..

జూకల్ నుంచి పెద్దషాపూర్ వెళ్లే మార్గంలో ఉన్న రైల్వే క్రాసింగ్ వద్ద అండర్‌పాస్ పనులు జరుగుతున్నాయి. ఇక్కడ సమీపంలో ఉన్న పొలాలకు వెళ్లే మార్గంతో పాటు ప్రధాన మార్గంలో అండర్‌పాసు వంతెన నుంచి వెళ్లేలా పనులు చేపట్టారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే జూకల్, కాచారం, రాయన్నగూడ, సుల్తాన్‌పల్లి, మల్కారం వాసులకు రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోనున్నాయి.



పెద్దషాపూర్–చౌదరిగూడ మార్గంలోని రైల్వే అండర్‌పాస్

వరద కష్టాలకు చెక్...

రైల్వే అండర్ పాస్‌ల వంతెన వద్ద వరదనీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. పెద్దషాపూర్–చౌదరిగూడ మార్గంలో ఇది వరకే అండర్‌పాస్ పనులు పూర్తి కాగా.. ఇక్కడ తరచూ వరదనీరు నిలిచి రాకపోకలు నిలిచిపోతున్నాయి. వరదనీరు బయటకు వెళ్లే పైపులైన్ ఇరుకుగా ఉండి.. అందులో మట్టి, చెత్త చేరడంతో నీరు బయటకు వెళ్లడంలేదు. దీంతో రైల్వే అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు.

- రైల్వే అండర్‌పాస్ వంతెన మార్గంలో నాలుగు దిక్కుల నుంచి వర్షం పడకుండా పై భాగంలో షెడ్డు నిర్మాణం చేపట్టారు. వర్షపు నీటికి అడ్డుకట్ట వేయడంతో పాటు వాహనదారులకు ఇబ్బందులు లేకుండా రోడ్డు మార్గంలో సరైన వెలుతురు ఉండేలా షెడ్డు నిర్మిస్తున్నారు. వర్షపు నీరంతా అండర్‌పాస్ మార్గంలో నిలుస్తుంది. ఆయా ఇబ్బందులను అధిగమించడానికి రైల్వే అధికారులు తీసుకున్న చర్యలతో వాహనదారులకు కష్టాలు తీరుతాయి.

సమస్యల పరిష్కారంలో రాజీపడం

మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి



లేక్ వ్యూకాలనీ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించే విషయంలో రాజీ పడకుండా సత్వరమే పరిష్కరిస్తానని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హౌసింగ్ బోర్డు లేక్ వ్యూ కాలనీలో స్థానికుల విజ్ఞప్తి మేరకు బుధవారం జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. భూగర్భ డ్రైనేజీ లైన్ సరిగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మట్టి రోడ్డు ఉండటంతో వరద నీరు చేరుకొని చాలా అసౌకర్యాంగా బురదమయంగా మారుతున్నదన్నారు. వెంటనే నూతన సివరేజ్ పై ఎస్టిమేషన్ వేసి నిధులు మంజూరు అయ్యేలా చూడాలన్నారు. నూతన సీసీ రోడ్డు పనులు ప్రణాళిక కూడా రూపొందించాలని ఆయన ఆదేశించారు. నూతన పైపులైన్ మ్యాచ్ అయ్యేలా దానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జలమండలి సూపర్‌వైజర్ ప్రసాద్, జీహెచ్‌ఎంసీ ఏఈ నర్సింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ భాను, అడికే జనార్దన్, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, మన్మోహన్‌రెడ్డి, నర్సిరెడ్డి, శర్మ, గంగాధర్, అభిషేక్, తలారి చిన్న, కొండల్, శంకర్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

మైలార్‌దేవ్‌పల్లి: రైలు పట్టాలు దాటుతున్న ఓ వ్యక్తిని రైలు ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ... బుధవారం సాయంత్రం సంతోష్ నగర్ మాదన్నపేట్‌కు చెందిన ఇద్దరు ఉడంగడ్డలోని రైలు పట్టాలు దాటుతున్నారు. వారిలో అబ్దుల్ మాజిద్(45) అనే వ్యక్తికి రైలు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన మాజిద్ అక్కడికక్కడే మృతి చెందాడు. తనతో వచ్చిన వ్యక్తి తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. పోలీసులు ఘటన స్థలికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ విషయంలో తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని కాచిగూడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

శంషాబాద్: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య వలస కూలీ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... నిర్మల్‌కు చెందిన జిందాల్ చవన్‌రాజు(45) కుటుంబ సభ్యులతో కలిసి పట్టణంలోని గొల్లపల్లిలో నివాసముంటున్నాడు. గతేడాది కూతురి వివాహం కోసం అప్పులే చేశారు. అప్పులు తీర్చే విషయంలో తీవ్ర మానసిక క్షోభకు గురయ్యాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ఇంట్లో హాల్లో పడుకున్న అతడు ఎంతకీ తలుపులు తీయకపోవడంతో కుటుంబసభ్యులు తలుపులు తీసి చూశారు. అప్పటికే ఉరి వేసుకున్న అతడు మృతిచెందినట్లు తెలుసుకున్నారు. ఈ మేరకు శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దోమల నివారణపై విద్యార్థులకు అవగాహన

రాజేంద్రనగర్: వర్షాకాలంలో విపరీతంగా వృద్ధి చెందే దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు బుద్వేల్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఉప కమిషనర్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ... దోమల కారణంగా ఎదురయ్యే అనారోగ్య సమస్యలతోపాటు నివారణకు తీసుకోవల్సిన చర్యలను వివరించారు. అలాగే విద్యార్థులు తమ తల్లిదండ్రులకు దోమల నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలను రాబట్టారు. ఈ సందర్భంగా మలేరియా సిబ్బంది ప్ల కార్డుల ద్వారా విద్యార్థులకు దోమల సంతానోత్పత్తి, వాటి కేంద్రాలు, వాటితో కలిగే అనారోగ్య సమస్యలను అర్థమయ్యేలా విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద ముంపు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలి



ఎమ్మెల్యే మేరాజ్ హుస్సేన్‌తో కలిసి ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్

చార్మినార్: లోతట్టు ప్రాంతాల్లో వరద ముంపు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాలకు చార్మినార్ జోన్ సంతోష్ నగర్ సర్కిల్ లో ముంపునకు గురైన ప్రాంతాలను యాకుత్ పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. లోతట్టు ప్రాంతాల్లో వరద నీటిని పంపింగ్ చేసి ముంపు లేకుండా చర్యలు తీసుకోవాలని మెయింటనెన్స్ సీఈని ఆదేశించారు. వరద నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు శాశ్వత చర్యల కోసం సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కమిషనర్ వెంట జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న, జోనల్ ఎస్.ఈ మహేశ్వర్ రెడ్డి, డిసి మంగతాయారు, సీఈ సహదేవ్ రత్నాకర్, ప్రాజెక్టు ఈఈ శ్రీనివాస్, కార్పొరేటర్ వసీయుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవ కమిటీ నూతన కార్యవర్గం

గోల్కొండ: కార్వాన్ సబ్జిమండీలోని నల్లపొచమ్మ, మాత మహంకాళి దేవీ బోనాల ఉత్సవాల కమిటీ అధ్యక్షుడిగా దోర్నల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం బోనాల ఉత్సవాల నూతన కమిటీ ఎన్నికలు జరిగాయి. గౌరవ సలహాదారులుగా కట్ట రాజయ్య, గూడబోయిన శివరత్నం, కట్ట శివరాజ్, జె.వేణు, వేణుకుమార్‌గౌడ్, కట్ట నర్సింగ్‌రావు, ఏ.శ్యాంసుందర్, గుడుమని అశోక్‌కుమార్, జి.నిరంజన్‌బాబు, యాట నందకిశోర్ తదితరులు ఉన్నారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేస్తాం

తెలంగాణ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు



ప్రముఖులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేస్తామని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రవీంద్రభారతిలో శాంతికృష్ణ సేవాసమితి 40వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని 1111వ అంతర్జాతీయ సాంస్కృతిక మహోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ జానపద కళలకు ప్రోత్సాహాన్ని అందిస్తామన్నారు. శాసన మండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి మాట్లాడుతూ.. బతుకమ్మ తల్లి జన్మస్థలమైన చౌటపల్లి గ్రామంలో 40 ఏళ్ల క్రితం ప్రారంభమై అనేక దేశాల్లో మన సంస్కృతి, సంప్రదాయాలపై ప్రదర్శనలు ఇవ్వడం అభినందనీయమన్నారు. 2 రోజుల పాటు సాగిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకోగా పలువురు ప్రముఖులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కేఆర్.నాగరాజు, ఎమ్మెల్సీ దాసోజి శ్రవణ్, జాతీయ బీసీ కమిషన్ టి.ఆచారి, వంశీ కళా సంస్థల వ్యవస్థాపకుడు వంశీ రామరాజు, ఏసీపీ కె.ఎం.కిరణ్‌కుమార్, సంస్థ వ్యవస్థాపకులు శాంతి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం నిరంతర కృషి

రాజేంద్రనర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ: అభివృద్ధి, సంక్షేమం కోసం నిత్యం పనిచేయడం చాలా సంతోషంగా ఉందని రాజేంద్రనర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బుధవారం 12, 17, 18, 19, 20వ డివిజన్లలో రూ. 7.44 కోట్ల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి డివిజన్‌లో అవసరమైన అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని, అభివృద్ధి పనులలో నాణ్యత లోపిస్తే ఎట్టిపరిస్థితిలో సహించేది లేదని స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్ బచ్చలకూరి శరత్ చంద్ర, డీఈ యాదయ్య, టీపీఓ రాఖేష్, మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ పూల్లపల్లి రాజేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, శ్రీలత సురేష్‌గౌడ్, ముద్దం రాము, అస్లాం, నాయకులు పాపయ్య యాదవ్, తలారి ప్రేమ్ కుమార్, కృష్ణారెడ్డి, బోగాల శ్రీనివాస్, సంగారెడ్డి, ఖాజాపాషా,టింకురెడ్డి, సత్య ఎల్లెంకి, సురేష్‌రెడ్డి, హరి ప్రసాద్, సంగారెడ్డి, సుమన్‌గౌడ్, హరీష్‌గౌడ్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంతో పర్యావరణ పరిరక్షణ



అత్తాపూర్‌లో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్

అత్తాపూర్: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించి పచ్చదాన్ని పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. అత్తాపూర్ డివిజన్‌లో మొక్కలు నాటు కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు అమ్మకు ఒక చెట్టు అనే నినాదంతో బుధవారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు సులిగే వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నారగూడెం మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటి నీరుపోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు విరివిగా మొక్కలను నాటాలన్నారు. ఇంటి పరిసరాలతో పాటు ఖాళీ ప్రదేశాలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. నిత్యం నీరు పోసి వాటిని పెంచితే రానున్న రోజుల్లో అవి మనకు నీడతోపాటు పుష్కలంగా వర్షాలు కురిచేసా చేస్తాయన్నారు. అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్, విజయ్‌కుమార్, కొమురయ్య, కిరణ్‌చారి, జయానంద్‌రెడ్డి, ఆర్.జగన్, జి.రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

రాజేంద్రనగర్: సీఎం సహాయనిధి నిరుపేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. అనారోగ్య కారణాలతో మెరుగైన వైద్యం కోసం సీఎం సహాయనిధి కింద రాజేంద్రనగర్ డివిజన్‌కు చెందిన పలువురికి మంజూరైన చెక్కులను ఆయన డివిజన్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకుడు ప్రగడంపల్లి శ్రవణ్‌తో కలిసి బుధవారం తన నివాసంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. నిరుపేదలకు సీఎం సహాయ నిధి నుండి నిధులు మంజూరయ్యేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. పార్టీ నాయకులు పడమటి శ్రీధర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను ఆపాలి: సీపీఐ

రాజేంద్రనగర్: దేశంలోని మావోయిస్టులను ఏరివేత పేరుతో చంపుతామని బహిరంగంగా ప్రకటించడం రాజ్యాంగం కల్పించిన మనిషి జీవించే హక్కును కాలరాయడమేనని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్‌రావు అన్నారు. రాజేంద్రనగర్ మండలం మైలార్‌దేవ్‌పల్లి, లక్ష్మీగూడ, ఉడంగడ్డలో బుధవారం సీపీఐ 10వ మండల మహాసభను ఆనంద్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పుస్తకాల నర్సింగ్ రావు మాట్లాడుతూ... ఆపరేషన్ కగార్‌ను ఆపాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టులను అంతం చేసి అపురూపమైన ఖనిజ సంపదను, అడవులను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసేందుకే కేంద్రం కుట్రలు పన్నిందన్నారు. కేంద్రం చర్యలను అడ్డుకొని పర్యావరణాన్ని తద్వారా మానవాళిని కాపాడుకోవాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. మైలార్‌దేవ్‌పల్లి కార్యదర్శిగా మహ్మద్ ఖాజా, సహాయ కార్యదర్శిగా సయ్యద్ సర్వర్, ముగ్గురు కమిటీ మెంబర్లను ఎన్నుకున్నారు. లక్ష్మీగూడ కార్యదర్శిగా జి.సదానంద గౌడ్, సహాయ కార్యదర్శులుగా కె.మధు, మహ్మద్ ఖాజా మోహినుద్దీన్, కమిటీ మెంబర్లుగా ముగ్గురిని ఎన్నుకున్నారు. ఉడంగడ్డ శాఖ కార్యదర్శి పి.ఉషన్, సహాయ కార్యదర్శిగా ఆర్.రాములు, ముగ్గురు కమిటీ మెంబర్లను ఎన్నుకున్నారు.

సందడిగా ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా మహిళా సిబ్బందికి ముగ్గుల కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు ఉదయం 10 గంటలకు మహిళా సిబ్బంది పాల్గొని రంగు రంగుల ముగ్గులను తీర్చిదిద్దారు. ఉత్తమ ముగ్గులకు టౌన్‌ప్లానింగ్ అధికారి మణిహారిక ఉత్తమ ముగ్గులను ఎంపిక చేసి మహిళల పేర్లను నమోదు చేసుకున్నారు. ఎంపిక చేసిన మహిళలను సెప్టెంబర్ 10వ తేదీన జరిగే ముగింపు కార్యక్రమంలో సత్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్వరూప, కవిత, జ్యోత్స్న, సుష్మ, శిరీష, అనూష, రాణి, రాజశ్రీ, మీనాక్షమ్మ, మంజుల, రమాదేవి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లేవి..?

- సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది
- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్
- జీహెచ్‌ఎంసీ అధికారుల పనితీరుపై ఆగ్రహం

లంగర్‌హౌస్: బోనాల ఉత్సవాల ఏర్పాట్లలో శాఖల మధ్య సమన్వయ లోపం కనిపిస్తోందని, ముఖ్యంగా జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గోల్కొండ జగదాంబిక అమ్మవారి బోనాల సందర్భంగా గోల్కొండ కోటలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాట్ల వివరాలను గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ కొండెపుడి చంటిబాబును అడిగి తెలుసుకున్నారు. ఓ వైపు సమావేశాలు నిర్వహిస్తుంటే జీహెచ్‌ఎంసీ, విద్యుత్ శాఖ, డీఎంహెచ్‌ఓ అధికారులు హాజరుకాకపోవడంపై మండిపడుతూనే జీహెచ్‌ఎంసీ కమిషనర్‌తో పాటు మంత్రికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు.

రేపటి నుంచి సమన్వయంతో పని చేయాలి

బోనాల ప్రారంభానికి తక్కువ సమయం ఉందని ఆర్టీ కార్యాలయంతో పాటు అన్ని శాఖల వారు గోల్కొండలో ఏర్పాట్లు చేయాలన్నారు. కోటపైకి వెళ్లేందుకు ర్యాంపు మరమ్మతులు చేపట్టాలని మంత్రి హెచ్చరించినా పనులు ప్రారంభించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్మన్ చంటిబాబు సూచన మేరకు గతంలో తేనెటీగల దాడి వల్ల 48 మందికి గాయాలయ్యాయని, చెట్లు, గోడలకు అలాంటివి ఉంటే ముందే తొలగించాలన్నారు. అనంతరం ఆమె నాగదేవత పుట్ట, మొదటి మెట్టు వరకు వెళ్లి పూజలు చేసి ర్యాంపును పరిశీలించారు.

శివసత్తులు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండండి

బోనాల సందర్భంగా గోల్కొండతో పాటు అన్ని ఆలయాల వద్ద శివసత్తులు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని అదనపు పోలీస్ కమిషనర్ విక్రం సింగ్ మాన్ సూచించారు. గోల్కొండ బోనాల ముఖ్య రోజుల్లో 14 ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందన్నారు. అధికారులు వారికి కేటాయించిన ప్రాంతాల్లో వాహనాలు పార్కు చేసి గోల్కొండ కోట వద్దకు నడిచిరావాలని సూచించారు. అన్ని శాఖలకు కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలని కోరారు. దేవాదాయ శాఖ కమిషనర్ వెంకటరావు, వివిధ శాఖల అధికారులు చంద్రమోహన్, అహల్య, గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ చంటిబాబు పాల్గొన్నారు.